క్లుప్తంగా

ప్రజలకు దసరా శుభాకాంక్షలు

● మాజీ మంత్రి మేరుగు నాగార్జున

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అయిన దసరా(విజయదశమి) పండగను ప్రజలందరూ సంతోషంగా నిర్వహించుకోవాలని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ మంత్రి మేరుగు నాగార్జున ఆకాంక్షించారు. ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. దుర్గా మాత ఆశీస్సులతో ప్రతి ఇంటా మంచి జరగాలని, విజయాలు సిద్ధించాలని, అం దరూ ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులకు, నాయకులకు, కార్యకర్తలకు, శ్రేయోభిలాషులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

రేపు మద్దులూరులో భూముల రీసర్వే ప్రారంభం

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): మండలంలోని మద్దులూరు గ్రామంలో ఈనెల మూడో తేదీన శుక్రవారం నుంచి భూముల రీసర్వే ప్రక్రియ ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ నారాయణరెడ్డి తెలిపారు. రైతులు తమ భూములకు సంబంధించి హక్కు పుస్తకాలను సిద్ధంగా ఉంచుకోవాలని బుధవారం ఓ ప్రకటనలో సూచించారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు సాంత్వన

మద్దిపాడు: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించి పేదలపై భారం పడకుండా చేసిందని, దీన్ని రాష్ట్ర ప్రభుత్వం సమర్థించిందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం మండల కేంద్రం మద్దిపాడులో సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ మాట్లాడారు. కమర్షియల్ ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ సత్య ప్రకాష్, డీఆర్‌డీఏ పీడీ నారాయణ, సర్పంచ్ మద్దిరాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బహిరంగంగా మద్యం తాగితే కఠిన చర్యలు



మద్యం సీసాలు, వ్యర్థాలను శుభ్రం చేయిస్తున్న ఎస్సై అజయ్‌బాబు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ పట్టుబడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సంతనూతలపాడు ఎస్సై అజయ్‌బాబు హెచ్చరించారు. బుధవారం సంతనూతలపాడు–ఒంగోలు మధ్య ఎస్ఎస్పీ కాలువ పక్కన గల వెంచర్ల వద్ద మద్యం తాగేందుకు అవకాశమున్న ప్రదేశాలను ఎస్సై తమ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఆయా ప్రదేశాల్లో ఉన్న ఖాళీ మద్యం సీసాలు, వ్యర్థాలను శుభ్రం చేయించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

● వేదిక ఫౌండేషన్ నిర్వాహకులు సిద్దాంటీ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వేదిక ఫౌండేషన్ నిర్వాహకులు సిద్దాంటీ

ఒంగోలు సబర్బన్: వేదిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. స్థానిక దేవుడు చెరువులో ఫౌండేషన్ కార్యాలయంలో ప్రత్యేకంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ది సెవెన్ ఫౌండేషన్, మేరా యువభారత్ ప్రకాశం జిల్లా వారి సహకారంతో వేదిక ఫౌండేషన్ నిర్వాహకురాలు సిద్ధాంటి దుప్పట్లు పంపిణీ చేశారు. వేదిక ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎస్ ఆదినారాయణ, గ్రంథాలయ చీఫ్ అడ్వైజర్ జి గురువారెడ్డి, ఆలిండియా కళా రంగం జిల్లా అధ్యక్షురాలు చల్లా నాగేశ్వరమ్మ, గ్రంథాలయ ఆఫీసర్ సంపూర్ణ పాల్గొన్నారు.

దుష్ట సంహారిణి.. మహిషాసురమర్దిని!



మహిషాసురమర్దినిగా అచలానందాశ్రమంలోని గోవిందమాంబ అమ్మవారు



శాకంబరీదేవిగా లాయరుపేట సాయిబాబా ఆలయంలోని రాజరాజేశ్వరీదేవి



సమతానగర్ దుర్గమ్మ దేవస్థానంలో కుంకుమార్చన



కళారం నగరోత్సవంలో రాక్షసుడిని వధిస్తున్న కాళికాదేవి ఘట్టం ప్రదర్శిస్తున్న కళాకారులు



నెహ్రూ కాలనీలోని దుర్గమ్మ సన్నిధానంలో నిప్పుల హోమ గుండం

- ● వైభవంగా కళారాల మహోత్సవం
- ● జనసంద్రమైన నగర వీధులు
- ● ప్రత్యేక అలంకరణలో కళారాలు
- ● భద్రత ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ

ఒంగోలు మెట్రో:

నగరంలోని పలు వీధుల్లో ఏర్పాటు చేసిన దుర్గమ్మ మండపాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం నుంచి ఆలయాల్లో అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూలైన్లో బారులు తీరారు. వివిధ ఆలయాల్లో అమ్మవారు ఎరుపు రంగు చీరతో మహిషాసురమర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నెహ్రూ కాలనీలోని దుర్గా మల్లేశ్వరి దేవస్థానంలో ముత్తయిదువులు సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు. సాయంత్రం చండీ హోమాల్లో పాల్గొన్నారు. గంటాపాలెంలోని పార్వతీదేవి కళారానికి, కొత్తపట్నం బస్టాండ్ నల్లూరి నర్సింగ్ హోమ్ దగ్గర ఉన్న బాలా త్రిపుర సుందరీదేవి కళారానికి, కేశవస్వామి పేటలోని మహిషాసురమర్దిని కళారానికి అర్చకులు పూజా క్రతువులు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. దేవాలయాల వద్ద, కళారాలు తిరిగే వివిధ మార్గాల్లో ఎస్పీ హర్షవర్ధన్ రాజు భద్రత ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తూ పోలీస్ అధికారులకు తగు సూచనలతో భద్రత ఏర్పాట్లను అప్పజెప్పారు. రాత్రికి జరిగిన కళారాల మహోత్సవం చూసేందుకు ఒంగోలు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో వచ్చారు.





గంటాయపాలెం పార్వతీదేవి కళారం ఊరేగింపు

తల్లిని కోల్పోయి.. తండ్రి సంరక్షణ కరువై!



చిన్నారులను బొమ్మరిల్లు ప్రతినిధికి అప్పగిస్తున్న సాగర్

ఒంగోలు సబర్బన్: తల్లిని కోల్పోయి.. తండ్రి సరైన సంరక్షణ లేక రోడ్లపై తిరుగుతున్న ఇద్దరు బాలలకు బొమ్మరిల్లు బాలల ఆశ్రమంలో ఆశ్రయం కల్పించారు. తల్లి చనిపోయింది, తండ్రి మద్యానికి బానిసై పిల్లలను గాలికి వదిలేశాడు. వాళ్లిద్దరూ యాచిస్తూ తిరుగుతుండగా హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీ సాగర్ చేరదీశాడు. వివరాలు.. అమ్మ ప్రమాదంలో చనిపోయి సంవత్సరం అవుతోందని, నాన్న ఉదయాన్నే కూలి పనులకు వెళ్లి రాత్రి ఎప్పుడు వస్తాడో, రాడో తమకు తెలియదని, నాన్న మద్యానికి బానిసయ్యాడని, తమకు ఆకలి వేసినప్పుడు చుట్టుపక్కల వారి దగ్గరకు వెళ్లి అడిగి ఎవరైనా పెడితే తింటామని ఆ చిన్నారులు తమ బాధను సాగర్‌కు చెప్పుకున్నారు. వెంటనే ఈ విషయాన్ని జిల్లా బాలల సంరక్షణ అధికారి పి.దినేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన దినేష్ కుమార్ బాలల వద్దకు చేరుకుని వారి తండ్రిని పిలిపించి విచారించారు. తాను బిడ్డలకు సరైన సంరక్షణ చేయలేకపోతున్నానని చెప్పాడు. తమ బిడ్డలకు ఆశ్రయం కల్పించమని తండ్రి వేడుకున్నాడు. వెంటనే జిల్లా బాలల సంరక్షణ అధికారి పి.దినేష్‌కుమార్ ఈ విషయాన్ని జిల్లా బాలల సంక్షేమ కమిటీ సభ్యులు నీలిమ దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాల మేరకు ఇద్దరు బాలలను సంరక్షణ, రక్షణ కోసం ఒంగోలు హౌసింగ్ బోర్డ్‌లోని బొమ్మరిల్లు బాలల ఆశ్రమంలో చేర్పించారు.

ప్రతిబింబించే కథలకు గుర్తింపు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

ఒంగోలు మెట్రో: కష్టాలు, కన్నీళ్లు ప్రతిబింబించే కథలు కలకాలం నిలిచే ఉంటాయని ప్రముఖ నాటక రచయిత డాక్టర్ పాటిబండ్ల ఆనందరావు అన్నారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ చంద్రశేఖర్ ఇండ్ల రచించిన బోర చెక్కు, మ్యాజిక్ ఇన్ కథల సంపుటి ఆవిష్కరణ సభకు బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అట్టడుగు జీవిత కోణాలను ఆవిష్కరించే కవిత్వం, కథలు, నాటికలు సమాజ వికాసానికి తోడ్పడతాయన్నారు. సగటు మనిషి జీవిత నేపథ్యాలను ఇండ్ల చంద్రశేఖర్ తన కథల్లో ప్రతిబింబించారని ప్రశంసించారు. సభకు అధ్యక్షత వహించిన ప్రకాశం జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లా నుంచి వచ్చిన కథా రచయిత ఇండ్ల చంద్రశేఖర్ యువ కథ రచయితగా రెండు తెలుగు రాష్ట్రాల్లో తనదైన ముద్ర వేసుకొని సీనియర్ కథకులను సైతం కథలతో ఆకట్టుకుంటున్నారని అభినందించారు. సాహితీవేత్తలు డాక్టర్ నూకతోటి రవికుమార్ బోర చెక్కు కథల సంపుటిని ఆవిష్కరించగా మ్యాజిక్ ఇన్ కథా సంపుటిని శ్రీరామకవచం సాగర్ ఆవిష్కరించారు. ప్రముఖ సాహితీ విశ్లేషకులు డాక్టర్ కోయి కోటేశ్వరరావు బోర చెక్కు గురించి మాట్లాడుతూ ఇందులో ఉన్న 11 కథలు అట్టడుగు వర్గాల జీవితాలను వెలుగులోకి తీసుకురావడమే కాకుండా తన రచనా సామర్థ్యంతో వాటికి సజీవత్వాన్ని తీసుకొచ్చారని పేర్కొన్నారు. మ్యాజిక్ ఇఫ్ పుస్తకంపై విశ్లేషణ చేసిన ప్రముఖ కథా రచయిత కాట్రగడ్డ దయానంద మాట్లాడుతూ కథారచనలకు సీనియారిటీతో సంబంధం లేదని, సమాజాన్ని చదివే యువ రచయితలు కూడా అద్భుత కథలు సృష్టిస్తున్నారని, అటువంటి వారిలో ఇండ్ల చంద్రశేఖర్ ఒకరన్నారు. అనంతరం రచయిత డాక్టర్ చంద్రశేఖర్ ఇండ్ల మాట్లాడుతూ జిల్లాలో సుప్రసిద్ధ కథారచయితలు ఉన్నారని, వారి స్ఫూర్తితో నేటి సమాజంలో జరుగుతున్న పరిణామాలను అవగాహన చేసుకుని తాను కథా రచనలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం చంద్రశేఖర్ను ఘనంగా సత్కరించారు. ప్రముఖ కవి రఫీ స్వాగతంతో కార్యక్రమం ప్రారంభమైంది.

పశు కిసాన్ క్రెడిట్ కార్డులతో రుణాలివ్వాలి

ఒంగోలు సబర్బన్:



ఎల్‌డీఎం రమేష్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గొర్రెల కాపరులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణాలు ఇవ్వాలని ఏపీ గొర్రెలు మేకలు, పెంపకందారుల సంఘ జిల్లా కమిటీ సభ్యులు లీడ్ బ్యాంక్ మేనేజర్ డి.రమేష్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. బుధవారం స్థానిక భాగ్యనగర్ రెండో లైన్‌లోని కెనరా బ్యాంకు ఆర్ఎం కార్యాలయంలో ఆయన్ను కలిశారు. జిల్లాలో 20 లక్షల గొర్రెలు, మేకలు, 450 పైగా గొర్రెల పెంపకం దారుల సహకార సొసైటీలు, 10 వేల మంది సభ్యులు రిజిస్ట్రేషన్లై ఉన్నారన్నారు. ఈ వృత్తి ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కల్పిస్తోందని, నాణ్యమైన, బలమైన పౌష్టికాహారమైన మాంసాన్ని ఉత్పత్తి చేస్తూ సమాజాభివృద్ధికి తోడ్పడుతున్న రంగమని గుర్తు చేశారు. వృత్తి ద్వారా ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయలు ఆదాయం వస్తోందన్నారు. పెంపకందారుల్లో ఎక్కువ మంది సన్నచిన్న కారు, పేద రైతులు ఆర్థికంగా వెనుకబడి ఉన్నారన్నారు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గొర్రెలను కాపాడుకోవడం కోసం షెడ్లు, మందులు, మేత ఖర్చులు విపరీతంగా పెరిగాయని చెప్పారు. ఈ నేపథ్యంలో మెయింటినెన్స్ కోసం బ్యాంకుల ద్వారా పెంపకందారులకు రూ.ఐదు లక్షల రుణం ఇచ్చి ఆర్థిక సహకారం అందించాల్సిన అవసరం ఉందని వివరించారు. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం, ఉపాధి పెరుగుతుందని చెప్పారు. జిల్లాలోని అన్ని బ్యాంకులకు గొర్ల కాపరులకు విరివిగా రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని లీడ్ బ్యాంకు మేనేజర్ కోరారు. రాష్ట్ర కార్యదర్శి పూసపాటి వెంకట్రావు, జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రి అంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షుడు బొడ్డు రామరాజు, చిట్టిబోయిన చిరంజీవి పాల్గొన్నారు.



శ్రీవారికి నేత్ర పర్వంగా ఊంజల్ సేవ



ఊంజల్ సేవలో శ్రీవారు

ఒంగోలు మెట్రో: ఒంగోలు కొండమీద శ్రీగిరి వెంకటేశ్వర స్వామి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం ఆలయ అర్చకులు శ్రీవారికి ఊంజల్ సేవను నేత్ర పర్వంగా నిర్వహించారు. ప్రముఖ గాయకుడు, శ్రీగిరి దేవస్థానం ఆస్థాన సంగీత విద్వాంసుడు వీవీఎస్ వినోద్ కుమార్ అన్నమాచార్య సంకీర్తనలను ఆలపించారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, అర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తల మండలి ప్రతినిధులు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారి, ఆలూరు జై శంకర్, ఫణి కుమార్, కుమార ఆత్రేయ, వంశీ కృష్ణ తదితరులు వినోద్ కుమార్‌ను సత్కరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపై శ్రద్ధ పెట్టండి

● ఇన్‌చార్జి డీపీఓ వెంకటేశ్వరరావు



బీసీ కాలనీలో పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీపీఓ వెంకటేశ్వరరావు

మద్దిపాడు: మండల కేంద్రమైన మద్దిపాడులో పారిశుధ్య పనులను ఇన్‌చార్జి డీపీఓ వెంకటేశ్వరరావు బుధవారం ఉదయం పరిశీలించారు. మద్దిపాడు సెంటర్, బీసీ కాలనీల్లో పర్యటించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై కాలనీవాసులకు అవగాహన కల్పించడంతోపాటు ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేయించారు. అంతనం ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను పరిశీలించారు. షెడ్లకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని పంచాయతీ కార్యదర్శి నూరుల్లాను ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అవసరాన్ని బట్టి మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ఏఎన్ఎంలకు సూచించారు. స్వర్ణ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా హౌస్ ట్యాక్స్, నాన్ ట్యాక్స్‌కు సంబంధించిన అరియర్స్ మొత్తం ఈ నెలాఖరులోగా జమ చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. రక్షిత నీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఆయన వెంట సచివాలయ సిబ్బంది ఉన్నారు.